

కథా నిలయం

# మనిషి



రసరాజు

కరెంట్‌బిల్ కట్టడానికి అదే చివరి రోజు...

ఈ చివర్నుంచి ఆ చివరి వరకు ఒకటే క్యూ. దాన్ని కలుపుతూ పక్కనే మరో క్యూ.

క్యూ ఎంతకీ తరగడం లేదు.

దయానిధి ఉదయం తొమ్మిది గంటల నుంచి క్యూలో అలా నత్తనడక నడుస్తూనే ఉన్నాడు.

పది దాటిపోయింది.

ఎవరో ముసిలాడు ఆయాసపడుతూ అప్పుడే వచ్చాడు. రెండో క్యూలో ఆఖర్న నిలబడ్డాడు.

అరగంట గడిచింది...

ఆ ముసిలాడి పరిస్థితి దయనీయంగా ఉంది. క్యూలో అడుగు తీసి అడుగు వేయలేకపోతున్నాడు. వయస్సు ఎనభై ఉంటుంది.

"ముగ్గుబుట్ట వంటి తల... ముడుతలు తేరిన దేహం..." దయానిధికి ఆ ముసిలాణ్ణి చూడగానే శ్రీశ్రీ గీతం గుర్తుకు వచ్చింది.

దయానిధి పుస్తకాలు బాగా చదివాడు.

ఆ తాతను చూడగానే అతనికి జాలి ముంచుకొచ్చింది.

ఆ క్యూ పూర్తయ్యేసరికి ముసిలాడికి కొన ఊపిరి ఉంటుందో లేదో అనిపించింది.

క్రమంగా ఆ ముసిలాడు అవతలి క్యూలో తనకు సమాంతరంగా వచ్చాడు.

ఇవతలి క్యూలో తనున్నాడు.

రెండు క్యూలకు మధ్య ఎంతో దూరం లేదు. చేయీ చేయీ కలిపేటంత దూరం...

కౌంటర్ నుంచి చూస్తే దయానిధి ఆ క్యూలో పదవవాడు. మరో అరగంటలో తను బయటపడిపోవడం ఖాయం.

ఆ ముసిలాడి పరిస్థితే బాధగా ఉంది. అతని వంతు వచ్చే సరికి ఎంతలేదన్నా గంటన్నరయినా పడుతుంది. అక్కడున్న వాళ్లెవరూ అతన్ని పట్టించుకోవడం లేదు. పైగా "ముందుకు జరగవేం..." అంటూ మధ్య మధ్య అతన్ని విసుక్కుంటున్నారు. ముసిలాడు ముక్కుతూ, మూలుగుతూ, అలాగే ఆ వాతావరణాన్ని సహిస్తున్నాడు.

పది నిమిషాలు గడిచాయి...

ఓపిక సన్నగిల్లిందో యేమో ఆ ముసిలాడు క్యూలోనే చతికిలబడిపోయాడు.

అది చూడగానే దయానిధికి గుండె చెమ్మగిల్లింది. అడుగు ముందుకు పడలేదు...

టైం చూశాడు...

పదకొండుకీ పది నిమిషాలు తక్కువ...

"ఆఫీసుకి రెండో శనివారం కాబట్టి సరిపోయింది... లేకపోతే పర్మిషన్ పెట్టి క్యూలో తపస్సు చేయవలసి వచ్చేది." అనుకున్నాడు.

"తాతగారూ..." దయానిధి పిలిచాడు పక్క

కు తిరిగి.

ముసిలాడికి ఆ మాట వినపడలేదు.

మళ్లీ పిలిచాడు...

ఇప్పుడు దయానిధి వంక చూశాడు ఆ ముసిలాడు.

"ఈ క్యూలోకి రండి... నేను మీ చోట్లో కొస్తా..." అన్నాడు దయానిధి. అంతకంటే మరో మార్గం దొరకలేదు. ఆ బిల్ తీసికొని తన బిల్‌తో పాటు కడదామంటే అక్కడున్న వాళ్లు ఊరుకోరు. "బతికించావు బాబూ... నీ కడుపు చల్లగా..." అంటూ ఆ ముసిలాడు దయానిధి స్థానంలోకి వచ్చాడు.

ఇరవై నిమిషాల్లో ఆ ముసిలాడు బిల్ కట్టేసి నవ్వుతూ ఇంటిముఖం పట్టాడు.

దయానిధికి క్యూలో ఆ రోజు చాలా సమయం పట్టింది. అయినా దాని గురించి బాధ పడలేదు. మానవత్వానికి కట్టే మందిరంలో – తనూ ఒక ఇసుక రేణువయినందుకు ఆనందించాడు.

ఇది జరిగిన నెల్లాళ్లకి–

ఆ ముసిలాడు గ్యాస్ సిలండర్స్ క్యూలో మళ్లీ ప్రత్యక్షమయ్యాడు.

దయానిధి ఈసారి ఆశ్చర్యపోయాడు.

ఇంట్లోవాళ్లు – ముసిలాణ్ణి ఎందుకు అలా ఇబ్బంది పెడుతున్నారో అర్థం కాలేదు.

ఈసారి తను క్యూలో చివరున్నాడు. ఆ ముసిలాడు మాత్రం తన కంటే కొంచెం ముందున్నాడు. అక్కణ్ణుంచి మరో వందమంద యినా ఆ క్యూలో అతని ముందున్నారు. రెండు గంటలన్నా పడుతుంది. తనవంతు వచ్చేసరికి.

ఆ ముసిలాడిలో ఇప్పుడూ అదే పరిస్థితి...

క్యూలో కూర్చుండిపోయాడు. నీరసంగా ఉన్నాడు...

"ముసిలాడికిది బాగా అలవాటయి పోయింది..." క్యూలో ఎవరో చిరాకు పడ్డారు.

జలుబు చేసిందేమో – ముసిలాడు పదే పదే భుజం మీదున్న కండువాతో ముక్కు తుడుచుకొంటున్నాడు.

ఆ క్యూలో ముందున్న వాళ్లలో ఎవరో కుర్రాడు ఆ పెద్దాయన పరిస్థితి గ్రహించాడు.

సాయం చేయాలనుకొన్నాడు...

ఆ కుర్రాడు వెనక్కి – ముసిలాడు ముందుకీ మారారు.

ఆ సహాయానికి ముసిలాడు కుర్రాణ్ణి చెయ్యెత్తి దీవించాడు.

తన పని తొందర్లోనే ముగించుకొని ముసిలాడు నవ్వుకొంటూ వెళ్లిపోయాడు.

దయానిధి వంతు వచ్చేసరికి పదకొండున్నరయింది.

ఆఫీసులో అడుగు పెట్టేసరికి పన్నెండు...

"ఏమిటి బ్రదర్... ఇంత ఆలస్యం...?" అన్నాడు పరాంకుశం.

"ఏముంది... గ్యాస్ బాధితులం... ఇప్పటికిగాని క్యూలో నుంచి విముక్తి దొరకలేదు..." అంటూ కుర్చీలో నీరసంగా కూలబడ్డాడు దయానిధి.

"గ్యాస్ వచ్చిందా...?" ఆత్రంగా అడిగాడు పరాంకుశం.

"ఏం... నీకూ అయిపోయిందా...?"

"ఎప్పుడో అయిపోయింది..."

"సీరియల్ నెంబరెంత...?"

"తొమ్మిదీఇరవై..."

"పన్నెండొందల వరకు ఇస్తున్నారే!... మరి నువ్వు రాలేదేమిటి?..."

"ఓ ముసిలాణ్ణి పంపించానులే... ఈపాటికి పని పూర్తిచేసేసి ఉంటాడు..."

"ముసిలాడా...?" ఆశ్చర్యంగా అడిగాడు దయానిధి.

"ఏం... నీకు తగిలాడా...?"

"గిరజాల జుట్టు..."

"ఆ... ఆ ముసిలాడే... మా మిసెస్‌కి తాత... మా దగ్గరే ఉంటాడు..."

"మీ తాలూకేనా... అయ్యో... ఆయన్నెందుకు బ్రదర్ ఆ వయసులో అలా ఇబ్బంది పెట్టడం..." దయానిధి బాధపడుతూ అన్నాడు.

"ఆయనికి ఆ ఇబ్బంది పది నిమిషాలే... మనకయితే పూటలూ... రోజులూ..."

"నువ్వనేదేమిటో అర్థం కావడం లేదు..."

"తొందర్లో పని అవ్వాలని సినిమా టికెట్స్‌కీ, రైల్ టికెట్స్‌కీ ఒక్కోసారి ఆడాళ్లను మనం పంపిస్తున్నామా లేదా...? ఇదీ అంతే..."

ఆ మాటలు విన్నాక దయానిధిలో మౌనం ఆవహించింది.

"ఇంట్లో నీకెవరూ ముసిలాళ్లు లేరా...?" పరాంకుశం ప్రశ్నించాడు.

"ఉన్నారు..."

"ఉన్నారా...? ఉంటే అదేమిటి బ్రదర్... దేవుడిచ్చిన అవకాశాల్ని ఉపయోగించుకోవడం తెలుసుకోవాలి...

రద్దీ భయంకరంగా ఉన్నప్పుడు ఇటువంటి ముసిలాళ్లను పంపిస్తేనే తొందరగా పనులవుతాయి... అవలేదూ... కాసేపాగి వెనక్కి తనే వచ్చేస్తాడు... ఇదొక టెక్నిక్... ఆ ముసిలాణ్ణి నీలాంటి దయానిధులెవరో ఆదుకొంటారు... అందరికంటే ముందుగా పనిముగించుకొని నవ్వుతూ వచ్చేస్తాడు... ఎంతయినా ముసిలాడు కదా... పైగా ఇది బుద్ధుడు పుట్టిన పుణ్య భూమి... జాలి... సానుభూతి... అక్కడక్కడా ఇంకా బతికే ఉంటాయి... అందులోనూ మా ముసిలాడికి కొంచెం నటన కూడా తెలుసు... నీలా నేనంతసేపు క్యూలో నిలబడలేను... నిరీక్షించలేను... అప్పుడప్పుడు ఇటువంటి అత్యవసర పరిస్థితుల్లో ఆ ముసిలాడే మాకు పెద్ద దిక్కు... మనం పెట్టే భోజనానికి ఆ మాత్రమైనా గిట్టుబాటు కావద్దూ..." పరాంకుశం చిరునవ్వు చిందిస్తూ అన్నాడు.

ఆ మాటలకు నివ్వెరపోయాడు దయానిధి.

పరాంకుశం స్వార్థపరుడన్న విషయం తనకూ తెలుసు కానీ – అతని బుద్ధి ఇంత రాక్షసంగా ఉంటుందనుకోలేదు.

పని పూర్తిచేసుకునే విధంగా ముసిలాడు కూడా నటిస్తాడని తెలియగానే "ఔరా" అనుకొన్నాడు.

మంచితనం గెలిచిందో, ఓడిందో తనకైతే తెలీదు...

కానీ–

ఎదురుగా లోయలోకి కూలిపోతున్న "మనిషి" మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నాడు. ●